
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



సోమశిలలో 25.52 టీఎంసీలు
చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 25.52 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 11,135 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,380
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,440
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,603
నవర (8 గ్రాములు)	రూ.44,824

వాతావరణం
గరిష్టం/కనిష్టం 38.4 /27.7
గాలిలో తేమ 95 శాతంగా ఉంది. జిల్లాలోని ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ వర్షం గురువారం కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

నోట్లొద్దు.. డిజిటలే ముద్దు



- సర్వం ఆన్‌లైన్ మయం
- ఫోన్ ద్వారా క్షణాల్లో నగదు చెల్లింపులు
- కిల్లీ కొట్టు నుంచి షాపింగ్ మాళ్ల వరకు అంతా డిజిటల్ చెల్లింపులే
- ఎక్కడ చూసినా క్యూఆర్ కోడ్ల దర్శనం



జేబులో రూ.500 నోటు పెట్టుకొని దుకాణానికి వెళ్లడం.. నచ్చిన వస్తువును కొనుగోలు చేయడం.. ఆపై చిల్లర సమస్యతో సతమతమవడం.. ఇదీ నిన్నామొన్నటి వరకు ప్రజలు నిరంతరం చవిచూసిన సమస్య. మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చిన సాంకేతికతను అందిపుచ్చుకొని డిజిటల్ మనీ రూపాంతరం చెందడంతో ఈ ఇబ్బందికి చెక్ పడింది. ప్రస్తుతం వాడవాడలా ఉన్న దుకాణాలు, రోడ్ల వెంబడి ఉన్న బంకుల్లో సైతం ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం క్యూఆర్ కోడ్లు అందుబాటులోకి రావడంతో ఫోన్ల ద్వారానే లావాదేవీలు అధికమయ్యాయి. ఈ పరిణామం ప్రజలతో పాటు వ్యాపారులకు సైతం లాభదాయకంగా మారింది.

నెల్లూరు సిటీ: నగరాలు, పల్లెలు డిజిటల్ మనీ దిశగా పరుగులుదీస్తున్నాయి. చిన్న మొత్తం నుంచి పెద్ద మొత్తం వరకు చెల్లింపులు ఫోన్ల ద్వారానే జరుగుతున్నాయి. ఎక్కడికి వెళ్లినా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరిపేందుకు అవకాశం ఏర్పడటంతో నగదును తమ వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ప్రజలకు పెద్దగా రావడంలేదు.

చిటికెలో చెల్లింపులు

జిల్లాలో దాదాపు 25 లక్షల మంది నివసిస్తున్నారు. దాదాపు రెండు లక్షలకు పైగా వ్యాపార సముదాయాలున్నాయి. కిరాణా కొట్లు.. కిల్లీ బంకులు.. వస్త్ర దుకాణాలు.. మెడికల్ షాపులు.. చివరికి బస్సులు.. రైళ్లలో ప్రయాణాలకు సైతం డిజిటల్ మనీని స్వీకరిస్తున్నారు. ఇలా దాదాపు అన్ని చోట్ల ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం క్యూఆర్ కోడ్లే దర్శనమిస్తున్నాయి. మరికొన్ని చోట్ల కార్డు స్వైపింగ్ కోసం పీఓఎస్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రజలు తమ ఆండ్రాయిడ్, యాపిల్ ఫోన్లలో ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొని చిటికెలో చెల్లింపులు జరుపుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా జిల్లాలో నిత్యం రూ.100 కోట్లకుపైగా చెల్లింపులు జరుగుతున్నాయని అంచనా.

చిల్లరతో పనేదీ..?

గతంలో రూపాయి, రెండు, ఐదు రూపాయల కాయిన్లకు డిమాండ్ ఉండేది. హోటళ్లు, కిరాణా దుకాణాల్లో చిల్లర అవసరమున్నా, లభ్యత అంతంతమాత్రంగానే ఉండేది. దీంతో వంద రూపాయల చిల్లర కోసం రూ.10 కమీషన్ ఇచ్చి మరీ తీసుకునేవారు. జిల్లాలో ఈ తరహాలో వ్యాపారం రోజూ భారీగా జరిగేది. ప్రస్తుతం చిల్లర అవసరాలు తగ్గడానికి కారణం ఆన్‌లైన్ చెల్లింపులేనని వ్యాపారులు పేర్కొంటున్నారు. గతంలో విడుదల చేసిన పది రూపాయల నాణేలు ఇప్పటికీ కొందరి వద్ద ఉన్నాయి. వీటిపై గతంలో వదంతులు వ్యాపించడంతో తీసుకునేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడంలేదు.

అప్రమత్తంగా లేకపోతే గుల్లే..

ఆన్‌లైన్ చెల్లింపులు ఎంత పెరిగాయో.. సైబర్ మోసగాళ్లు అంతే స్థాయిలో విజృంభిస్తున్నారు. లింకులను పంపి వీటిని క్లిక్ చేయాలని సూచిస్తున్నారు. అవగాహన లేని కొందరు వీటిని క్లిక్ చేసి తమ ఖాతాల్లోని నగదును అక్రమార్కులకు అప్పనంగా అప్పజెప్పున్నారు. ఇలాంటి మోసపూరిత లింకులు, సైబర్ కేటుగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు.

లెక్క లేకుండా ఖర్చు

డిజిటల్ మనీ వ్యాప్తిలోకి వచ్చాక ఎంత మేలు జరుగుతోందో.. అంతే నష్టం సంభవిస్తోంది. గతంలో జేబులో ఉన్న డబ్బును ఎంత వరకు అవసరమో అంత మేరకే వినియోగించేవారు. అయితే ప్రస్తుతం వచ్చిన నగదు చెల్లింపుల యాప్‌లతో ఎంత వెచ్చిస్తున్నామనే అంశమై చాలా మందికి అవగాహన ఉండటంలేదు. క్రెడిట్ కార్డుల్లో ఉన్న మొత్తంతో పాటు ఓవర్ లిమిట్ సౌకర్యాన్ని సైతం కల్పిస్తుండటంతో షాపింగ్‌లు, సినిమాలు, షికార్లకు యువత ప్రాధాన్యమిస్తున్నారు. డబ్బులను తిరిగి బ్యాంకులకు చెల్లించాల్సిన సమయం వచ్చినప్పుడు ఒత్తిడికి లోనవుతున్నారు. దీంతో ఆత్మహత్యలకు పాల్పడిన ఉదంతాలూ చోటు చేసుకుంటున్నాయి. ఎంత అవసరమో అంత వరకే పరిమితం కావాలని పలువురు సూచిస్తున్నారు.

న్యూస్‌రీల్

వివరాలను నమోదు చేసుకోండి

నెల్లూరు రూరల్: జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌కు ఈ ఏడాది నిర్వహించిన పరీక్షలో అర్హత సాధించిన ప్రభుత్వ, ఎయిడెడ్, కళాశాలల విద్యార్థులు తమ వివరాలను అక్టోబర్ ఒకటి నుంచి నవంబర్ 30లోపు నమోదు చేసుకోవాలని డీఈఓ గంగా భవానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ కార్డుపై ఉన్న తరహాలోనే ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ వివరాలు ఉండాలని చెప్పారు. నమోదు సమయంలో అక్షర దోషాలుంటే స్కాలర్‌షిప్ పొందేందుకు అర్హత కోల్పోతారని తెలిపారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్లో వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు దర్గామిట్టలోని పరీక్షల విభాగ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు.

క్రీడల్లోనూ ముందుండాలి



విద్యార్థికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న సుందరవల్లి

వెంకటాచలం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలని వీఎస్‌యూ వీసీ సుందరవల్లి పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు సమీపంలో గల వీఎస్‌యూలో వార్షిక క్రీడా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ క్రీడల్లో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేసిన అనంతరం ఆమె మాట్లాడారు. వీఎస్‌యూలో విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనేందుకు వీలుగా అనేక వసతులను మెరుగుపర్చామని చెప్పారు. ప్రాంగణంలోని తొమ్మిదెకరాల్లో క్రీడా మైదానాన్ని పూర్తిగా శుభ్రపర్చి అభివృద్ధి చేశామన్నారు. బాస్కెట్ బాల్ సిమెంట్ కోర్టును నూతనంగా నిర్మించామని, మైదానంలో పెరుగుతున్న గడ్డిని కట్ చేసేందుకు ట్రాక్టర్‌ను సైతం కొనుగోలు చేశామని వెల్లడించారు. 2022 – 23 సంవత్సరానికి సంబంధించిన వీఎస్‌యూ ఇంటర్ కాలేజియేట్ గేమ్స్, సౌతిండియా ఇంటర్ జోన్ వర్సిటీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపారని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మరుపూరు హెల్త్ క్లినిక్‌కు జాతీయ బృందం



పొదలకూరు: మండలంలోని మరుపూరులో గల వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించేందుకు గానూ నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) బృందం బుధవారం విచ్చేసింది. అరుణాచల్‌ప్రదేశ్ నుంచి డాక్టర్ విజయ్‌మానస్ కాలబ్, తెలంగాణ నుంచి మరియమ్మ హాజరయ్యారు. విలేజ్ హెల్త్ క్లినిక్ పనితీరు, క్లినిక్‌లో ప్రజలకు అందజేస్తున్న మందులు, వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. తొలుత ఎన్‌క్యూఏఎస్ బృందాన్ని సత్కరించి విలేజ్ హెల్త్ క్లినిక్ పనితీరును వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి వివరించారు. పేదలకు క్షేత్రస్థాయిలో వైద్యసేవలతో పాటు ఎంతో ఖరీదైన మందులను ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. ఎమ్మెల్‌హెచ్‌పీ కృష్ణవేణి, సచివాలయ ఏఎన్‌ఎంలు అన్నమారియా, జ్యోతి, ఆశ వర్కర్లు రమాదేవి, అన్నపూర్ణ, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో భారీ వర్షం



బోసిపోయిన ఆర్టీసీ కూడలి

నెల్లూరు(దర్గామిట్ట): నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో బుధవారం జోరు వర్షం కురిసింది. వారం రోజులుగా ఎండల తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలు వర్షంతో ఊరట చెందారు. రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. జిల్లాలో 22.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

బీసీల పక్షపాతి సీఎం



మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బీసీల పక్షపాతి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, రాష్ట్రంలో బీసీ కులగణనను చేపట్టేందుకు అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టిన ఆయనకు పలు బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు కృతజ్ఞతలను తెలియజేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ వెంకటనారాయణ ముదిరాజ్, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిశోర్‌సింగ్, సంచార జాతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆసిఫాబాబా మాట్లాడారు. వెనుకబడిన తరగతులకు సీఎం అండగా ఉన్నారని కొనియాడారు. బీసీ కులగణనను ఎంతో కాలంగా చేపట్టకపోవడంతో అభివృద్ధి ఫలాలను అందుకోలేకపోతున్నారని చెప్పారు.

మహిళా రైతుకు జాతీయ పురస్కారం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం ఏపిలగుంటకు చెందిన మహిళా రైతు నాయుడు సులోచనమ్మ తెలంగాణలోని ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీ ఆధ్వర్యంలో పురస్కారాన్ని బుధవారం అందుకున్నారు. పర్యావరణ పరిరక్షణ, సేంద్రియ ఎరువులతో ఉత్పత్తులను పెంపొందించడం అనే అంశంపై హైదరాబాద్‌లోని జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీలో సెమినార్‌ను సోమవారం నుంచి నిర్వహించారు. తన గ్రామంలోని భూముల్లో పదెకరాల్లో సాగు చేస్తున్న తీగజాతి కూరగాయలు, ఇతర ఆహార ఉత్పత్తులపై ఆమె ప్రతిభ చూపడంతో ఉత్తమ రైతుగా పురస్కారాన్ని అందజేశారు.

క్షేత్రస్థాయిలో సమస్యలకు పరిష్కారం



అర్జీలను స్వీకరిస్తున్న హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్
- ప్రతిష్టాత్మకంగా 'జగనన్నకు చెబుదాం'

పొదలకూరు: జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాన్ని చూపుతున్నామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పొదలకూరు ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ బుధవారం నిర్వహించారు. ఆయా శాఖలకు సంబంధించిన అర్జీలు అందిన వెంటనే అధికారులను పిలిచి సమస్యను నోట్ చేసుకొని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 60 అర్జీలు తమకు అందాయని పేర్కొన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మండలాల్లో బుధ, శుక్రవారాల్లో నిర్వహించనున్నామని వెల్లడించారు. జిల్లాలోని నాలుగు మండలాల్లో కార్యక్రమాలను ఇప్పటివరకు నిర్వహించామని తెలిపారు. రెవెన్యూ పరమైన సమస్యలు అధిక సంఖ్యలో తమ దృష్టికి వస్తున్నాయని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల్లో చేనేత కార్మికులు ఉన్న తరుణంలో మండల కేంద్రంలో చేనేత క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని చేనేత ఐక్యవేదిక నేతలు తనకు వినతిపత్రాన్ని సమర్పించారన్నారు. పట్టణానికి సమీపంలో సుమారు ఎనిమిది శ్మశాన వాటికలు ఉన్నాయని, కొన్నింటిలో ఆక్రమణలను తొలగించి శుభ్రం చేయించాలని కోరుతూ సామాజికపరమైన అంశాలపై సైతం అర్జీలు అందాయన్నారు. జేసీ కూర్మనాథ్, ఆర్డీఓ మలోల, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వడాయత్తు ఉత్సవం



ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



యాగశాలలో హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు, వేదపండితులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలో కొలువైన వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల్లో స్వామి వారికి వడాయత్తు ఉత్సవాన్ని నేత్రపర్వంగా బుధవారం నిర్వహించారు. స్వామి వారి విగ్రహానికి అభిషేకాన్ని జరిపారు. అనంతరం ఏకాంతసేవను నిర్వహించారు. ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వసంతోత్సవం

వసంతోత్సవాన్ని ఉదయం నిర్వహించారు. సిద్ధి, బుద్ధి సమేత గణపయ్య ఉత్సవ విగ్రహాలను మంగళవాయిద్యాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. దేవస్థాన సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు రంగు నీళ్లు చల్లుకుంటూ వసంతోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఏఈఓ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

యాగశాలలో ముగింపు పూజలు

వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల ముగింపు పూజలను నిర్వహించారు. ప్రధాన ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పర్యవేక్షణ యాగమూర్తికి హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు.

సింహపురిలో హనీరోజ్ సందడి



జేవీఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న హనీరోజ్

నెల్లూరు(బృందావనం): సినీ నటి, వీరసింహారెడ్డి ఫేమ్ హనీరోజ్ సింహపురిలో బుధవారం సందడి చేశారు. ట్రంక్‌రోడ్డులో జేవీఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. జేవీఆర్ షాపింగ్ మాల్ అధినేతలు శ్రీనివాస్, మురళి, రమేష్ ఆహ్వానం మేరకు నెల్లూరుకు తొలిసారి వచ్చానన్నారు. షాపింగ్ మాల్ అద్భుతంగా ఉందని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని కాంక్షించారు. షాపింగ్ మాల్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపైకెక్కి వీరసింహారెడ్డి చిత్రంలోని పాటకు అభిమానులతో కలిసి స్టెప్పులేస్తూ హుషారెత్తించారు. అభిమానులతో సెల్ఫీలు దిగారు.

తక్కువ ధరలకు నాణ్యమైన వస్త్రాలు

మూడు దశాబ్దాలకు పైగా వస్త్ర రంగంలో ఉన్న తాము ప్రతి ఒక్కరి అభిరుచులకు తగిన విధంగా వస్త్రాలను హోల్‌సేల్ ధరలకే రిటైల్‌గా అందించాలనే సంకల్పంతో షాపింగ్ మాల్‌ను నాలుగంతస్తుల్లో ప్రారంభించామని అధినేతలు తెలిపారు. అపరిమితమైన కలెక్షన్స్, అద్భుతమైన మోడల్స్, అందుబాటు ధరల్లో అన్ని రకాల వస్త్రాలు ఉన్నాయని చెప్పారు. కార్పొరేటర్ ఉమామహేష్ పాల్గొన్నారు.

సమాజంపై విద్యార్థులకు అవగాహన అవసరం

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తిరుమలేశ్వరరెడ్డి

వెంకటాచలం: విద్యార్థులు చదువుతో పాటు సమాజంపై అవగాహన పెంచుకోవాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కాకుటూరు సమీపంలో గల వీఎస్‌యూ 14వ వార్షికోత్సవాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ చాలా కీలకమైందని, ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదువుకోవాలని సూచించారు. చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించేందుకు విద్యార్థులు ఆసక్తి చూపాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి చదివిస్తుంటారని, వారు బాధపడే పరిస్థితిని ఏ విద్యార్థీ తీసుకురాకూడదని సూచించారు. అనంతరం వీసీ సుందరవల్లి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉద్యోగావకాశాలు వెతుక్కుంటూ వస్తాయని పేర్కొన్నారు. వీఎస్‌యూనూ అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏళ్ల కల సాకారం

రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. 20 ఏళ్ల క్రితం నాటి అసైన్డ్ భూములు.. ఏళ్లుగా సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించనుంది. భూములను అనుభవిస్తున్న రైతులకు యాజమాన్య హక్కు పత్రాలను అందించేందుకు అవసరమైన ప్రక్రియను చేపట్టింది. ఈ మేరకు అసైన్డ్ భూముల వివరాలను జిల్లా రెవెన్యూ యంత్రాంగం సిద్ధం చేస్తోంది.

- నిషేధిత జాబితా నుంచి త్వరలో అసైన్డ్ భూముల తొలగింపు
- 20 ఏళ్ల క్రితం 861 మందికి 1164 ఎకరాల కేటాయింపు
- భూ పంపిణీకి జాబితా సిద్ధం చేస్తున్న అధికార యంత్రాంగం



సాగులో ఉన్న అసైన్డ్ భూమి

నెల్లూరు (దర్గామిట్ట): నిషేధిత భూముల జాబితా నుంచి విముక్తి కల్పించి రైతులకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రెండు దశాబ్దాల తర్వాత భూములు తమ సొంతం కానుండటంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. యాజమాన్య హక్కులొస్తే క్రయవిక్రయాలకు సైతం అవకాశం లభించనుంది.

వివరాల సేకరణలో నిమగ్నం

అసైన్డ్ భూమికి సంబంధించిన అసలైన వారెందరు.. వీరి వద్ద ఉన్న భూమి ఎంత... అసైనీల వారసులెందరు.. వీరి వద్ద ఉన్న భూమి.. క్రయవిక్రయాల ద్వారా ఎన్ని ఎకరాల అసైన్డ్ భూమి ఎంత మంది మూడో వ్యక్తుల వద్ద ఉందనే వివరాలను బయటకు తీస్తున్నారు. ఇదే క్రమంలో భూ పంపిణీ కింద హక్కు కల్పించేందుకు ప్రభుత్వ భూమిని ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాల రైతులు, మాజీ సైనికుల వివరాలనూ సిద్ధం చేస్తున్నారు.

భూ పంపిణీ కోసం ప్రతిపాదనలివీ..

రెవెన్యూ డివిజన్	రైతులు	భూమి (ఎకరాల్లో)
నెల్లూరు	237	297
ఆత్మకూరు	158	286
కావలి	291	368
కందుకూరు	175	213
మొత్తం	861	1164

రైతులకు యాజమాన్య హక్కు

అసైన్‌మెంట్, చుక్కల భూములను 22ఏ (నిషేధిత భూములు) జాబితాలో చేర్చారు. వీటిలో 1954, జూన్ 18 కంటే ముందు నాటి అసైన్డ్ భూములను మాత్రమే ఇప్పటి వరకు ఈ జాబితా నుంచి తొలగిస్తూ వచ్చారు. అసైన్‌మెంట్ భూములకు విముక్తి కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. 20 ఏళ్ల క్రితం 861 మంది రైతులకు కేటాయించిన 1164 ఎకరాలకు సంబంధించి అసలైన వారు లేదా వారి వారసులకు యాజమాన్య హక్కు కల్పించాలని నిర్ణయించింది.

త్వరలో లబ్ధి

అసైన్ చేసిన ప్రభుత్వ భూమిని ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వారికి భూ పంపిణీ పథకం ద్వారా లబ్ధి చేకూర్చనున్నారు. జిల్లాలో వివిధ వర్గాలకు చెందిన 861 మంది రైతులు 1164 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్నట్లు గుర్తించారు. వీరికి భూ పంపిణీ పథకం ద్వారా హక్కును కల్పించనున్నారు.

హక్కులు కల్పించడం సంతోషకరం



అసైన్డ్ భూములు పొందిన రైతులకు ప్రభుత్వం పూర్తి హక్కులు కల్పించడం సంతోషకరం. జిల్లాలో 2003కు ముందు అసైన్డ్ భూములు పొందిన రైతులను గుర్తించే ప్రక్రియ జరుగుతోంది. ముగిసిన వెంటనే రైతులకు ప్రభుత్వ నిబంధనల మేరకు పట్టా హక్కులు కల్పిస్తాం. దీని ద్వారా పేద రైతు కుటుంబాలకు మరింత ఆర్థిక భద్రత చేకూరనుంది. – కూర్మనాథ్, జేసీ



నవోదయ ప్రవేశపరీక్ష వెయిటింగ్ లిస్ట్ విడుదల

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం కృష్ణాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2023 – 24 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించి ఏప్రిల్ నెల 29వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో వెయిటింగ్ లిస్టును ప్రిన్సిపల్ శ్రీనివాసరావు బుధవారం ప్రకటించారు. 1044586, 1044635, 1046114, 1044568, 1044874, 1045491, 1043086, 1044554, 1044656, 1045276, 1045435, 1043169, 1043761, 1043333, 1044229 రోల్ నంబర్లు జాబితాలో ఉన్నాయన్నారు. ఈ వివరాలను వారి తల్లిదండ్రులకు పంపుతామన్నారు. పూర్తి సమాచారం కోసం నవోదయ విద్యాలయంలోని హెల్ప్‌డెస్క్ ఫోన్ నంబర్ 89850 07588కు సంప్రదించాలని తెలియజేశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.70
సన్నవి : రూ.30
పండ్లు : రూ.8



రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీ ఆదాల, చిత్రంలో మేయర్ స్రవంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్ కొండాయపాళెంలో రూ.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు ఈ డివిజన్‌లో రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు జరిగినట్లు చెప్పారు. మరో రూ.కోటి మంజూరుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు నిధుల కేటాయిస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అన్ని వర్గాల వారికి పథకాల ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాల వ్యవస్థ ప్రజలకు ప్రభుత్వ సేవలు సులువుగా అందుతున్నాయన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. అవినీతికి ఏ మాత్రం తావులేకుండా ప్రజల వద్దకే సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, డివిజన్ ఇన్‌చార్జిలు రావు శ్రీనివాసరావు, సురేష్, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, మర్రిపాడు జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు ఏసునాయుడు, లంకా రామశివారెడ్డి, సునీల్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరకు పక్కాగా ఏర్పాట్లు



జాతర ఏర్పాట్లపై చర్చిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, సాయికృష్ణ యాచేంద్ర

- వైఎస్సార్‌సీపీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
- ఏర్పాట్ల పరిశీలన

వెంకటగిరి రూరల్: దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన వెంకటగిరి పోలేరమ్మ తల్లి జాతరను ఈ ఏడాది రాష్ట్ర పండగ హోదాలో వైభవంగా నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జాతర ఏర్పాట్లను బుధవారం రామ్‌కుమార్‌రెడ్డి, వెంకటగిరి రాజ కుటుంబీకులు, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర, ఎస్పీ పరమేశ్వరరెడ్డి కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పోలేరమ్మ తల్లి జాతరను రాష్ట్ర పండగగా గుర్తించడం వెంకటగిరీయుల చిరకాల కోరిక అన్నారు. దాని గురించి అడిగిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించి తగిన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నామని, సాయికృష్ణ యాచేంద్ర సలహాలు పాటిస్తున్నామన్నారు. అంతకుముందు స్థానిక ఎన్జీఆర్ భవనంలో పలుశాఖల అధికారులతో నేదురుమల్లి, గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్‌లు సమీక్ష నిర్వహించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

రెండో చాటింపు

వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ తల్లి జాతరకు సంబంధించి బుధవారం రాత్రి రెండో చాటింపు వేశారు. పూజా కార్యక్రమాల అనంతరం వచ్చేనెల 4, 5 తేదీల్లో అమ్మవారి జాతర జరుగుతుందంటూ తప్పెట్లు, తాళాలతో చాటింపు నిర్వహించారు.

1,500 మందితో బందోబస్తు

జాతరకు 1,500 పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు పెడతామన్నారు. జాతర సమయంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రైమ్, ట్రాఫిక్, సెబ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీలు విమలకుమారి, కులశేఖర్, రాజేంద్ర, లక్ష్మీనారాయణరెడ్డి, డీఎస్పీలు సూర్యనారాయణ, రాజగోపాల్‌రెడ్డి, ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

పోలేరమ్మ తల్లి జాతరకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను రామ్‌కుమార్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డిలు ఆవిష్కరించారు. ముందుగా వెంకటగిరి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాతర నిర్వహణకు తీసుకున్న చర్యల గురించి ఆరా తీశారు. అనంతరం రామ్‌కుమార్‌రెడ్డితో కలిసి పోలేరమ్మ తల్లిని దర్శించుకున్నారు.

ఏసీ మైదానంలో స్కూల్ గేమ్స్ ఎంపికలు



నెల్లూరు: స్విమ్మింగ్ జట్టు ఎంపికలో పాల్గొన్న విద్యార్థులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో అండర్–14, అండర్–17 బాలబాలికల జట్ల ఎంపికలను బుధవారం నిర్వహించారు. వీటికి ముఖ్యఅతిథిగా గుంటూరు ఆర్ఐపీఈ మహబూబ్‌బాషా హాజరయ్యారు. బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, స్విమ్మింగ్, జూడో, అండర్–14 వాలీబాల్, అండర్–14 హాకీ, ఫెన్సింగ్ జట్ల ఎంపికలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు విచ్చేశారు. నియోజకవర్గ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్స్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో నిర్వహించారు. శుక్రవారం సాఫ్ట్‌బాల్, హ్యాండ్‌బాల్, ఆర్చరీ, సైక్లింగ్, సెపక్‌తక్రా, రైఫిల్ షూటింగ్, యోగా తదితర వాటిల్లో ఎంపికలు నిర్వహిస్తామని స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.విజయ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, పి.థామస్ పీటర్, కార్యవర్గ సభ్యులు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు..



చిల్లకూరు: ఎంపికైన క్రీడాకారులతో ప్రిన్సిపల్ తదితరులు

చిల్లకూరు: ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులకు చిల్లకూరులోని గురుకుల పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో సుమారు 200 మంది పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీరేష్ పర్యవేక్షణలో నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, చెస్, హ్యాండ్‌బాల్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆయా పాఠశాలలకు, గ్రామాలకు మంచిపేరు తీసుకురావాలని క్రీడాకారులకు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మీరాసాహెబ్ సూచించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువతి కిడ్నాప్ కలకలం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో బుధవారం యువతి కిడ్నాప్ అంటూ కలకలం రేగింది. వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన ఓ యువతి బీటెక్ చదువుతోంది. ఆమెను ఓ వ్యక్తి ఇంటి వద్ద నుంచి బలవంతంగా కారులో ఎక్కించుకెళ్లాడని కుటుంబసభ్యులు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. స్థానికంగా ఉండే విజయకుమార్‌పై అనుమానం ఉందని వారు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇది ఇలా ఉంటే సదరు యువతి, యువకుడు ప్రేమలో ఉన్నారని, వారు ఇంట్లో నుంచి పరారై ఉండొచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో పోలీసులు అన్ని కోణాల్లో విచారిస్తున్నారు.

ఆరోగ్యశ్రీ పరిధిలోకి పొదలకూరు సీహెచ్‌సీ

- డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్



ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్

పొదలకూరు: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలోకి పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తీసుకొచ్చినట్లు డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్ తెలిపారు. సీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో సీహెచ్‌సీని చేర్చడంతో వైద్య సౌకర్యాలు మరింత మెరుగుపడతాయన్నారు. 24 గంటలు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని, శస్త్రచికిత్సలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని రకాల మందులు రోగులకు అందుబాటులో ఉన్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి అధికంగా నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌డీసీ చైర్మన్‌గా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యవహరిస్తుండడంతో సీహెచ్‌సీ బాగా అభివృద్ధి చెందిందన్నారు. ఆస్పత్రిలో ఎక్స్‌రే, బ్లడ్ బ్యాంక్, స్కానింగ్, అన్నిరకాల రక్తపరీక్షలు ఉన్నట్లు పేర్కొన్నారు. చిన్నపిల్లల వైద్యనిపుణుడితోపాటు, దంత, సాధారణ, గర్భకోశ, మత్తు డాక్టర్లు ఉన్నారన్నారు. 30 పడకల హాస్పిటల్‌గా కొనసాగిస్తున్నామని, 24 గంటల కడుపునొప్పి, కుటుంబ నియంత్రణ, హైడ్రోసిల్ శస్త్రచికిత్సలు కూడా చేస్తున్నట్లు తెలిపారు. రాత్రివేళల్లో వైద్యులు అందుబాటులో ఉంటున్నారని, ఎవరూ ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. డీసీహెచ్‌ఎస్ వెంట హెచ్‌డీసీ మెంబర్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, డీడీఓ డాక్టర్ ప్రసాద్, డాక్టర్ పద్మజ తదితరులున్నారు.

పెంచలకోనలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోనలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవర్లను తిరుచ్చిపై కొలువుదీర్చి క్షేత్రోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ అలంకార మండపంలో నవ కలశ స్థాపన, చతుస్థానార్చన, మహా సుదర్శన హోమం, లఘు పూర్ణాహుతి, వేద, దివ్య, ప్రబంధపారాయణాలు చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఆలయాల్లో పవిత్రాలను సమర్పించారు. కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 117
లేయర్ (లైవ్)	: 115
బ్రాయిలర్ చికెన్	: 206
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 230
లేయర్ చికెన్	: 195



• సాక్షి ఫొటోగ్రాఫర్‌కు అవార్డు



ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ పోటీలు నిర్వహించారు. ఇందులో నెల్లూరు సాక్షి ఫొటోగ్రాఫర్ విజయకృష్ణకు అవార్డు వచ్చింది. విజయవాడలో బుధవారం అడిషనల్ సీసీఎల్ఏ, సెర్ప్ సీఈఓ ఎండీ ఇంతియాజ్ అలీ చేతుల మీదుగా సర్టిఫికెట్, గోల్డ్ మెడల్ అందుకున్నారు.